క్లుప్తంగా

ఆన్‌లైన్ నమోదుపై శిక్షణ



వైద్యులకు శిక్షణ ఇస్తున్న చక్రపాణి

తాడిపత్రి రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం రోగుల ఆన్‌లైన్ నమోదుపై వైద్యులు, ల్యాబ్ టెక్నికల్ సిబ్బందికి రోలేట్ చక్రపాణి శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వైద్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్సకు వెళ్లినప్పుడు అక్కడి వైద్యులు ఆధార్ ఆధారంగా ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి నమోదు చేసిన రోగుల లక్షణాల బట్టి వైద్యం చేయడానికి వీలుంటుందన్నారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, సెల్ నెంబర్‌ను తీసుకురావాలని సూపరింటెండెంట్ డువిడ్ తెలిపారు.

రేపు క్రీడా పోటీలు

తాడిపత్రి రూరల్: మహిళా న్యాయవాదులు, సిబ్బందికి ఈనెల 8న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తాడిపత్రి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు గురువారం తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు సూపరింటెండెంట్‌కు పేర్లు ఇవ్వాలన్నారు.

ఆలయ నిర్మాణం పరిశీలన



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఓ మురళీక్రిష్ణ

పుట్లూరు: మండలంలోని చింతకుంటలో నిర్మాణంలో ఉన్న కాలభైరవస్వామి ఆలయాన్ని గురువారం దేవదాయ శాఖ ఈఓ మురళీక్రిష్ణ పరిశీలించారు. నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈయన వెంట గ్రామస్తులు, పూజరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలం



వేలం నిర్వహిస్తున్న
మున్సిపల్ కమిషనర్, అధికారులు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం 2025–26లో దిన సరి మార్కెట్, జంతు వధ శాల నుంచి సుంకం వసూలుకు వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 1 లక్షా 97 వేలు అదనంగా ఆదాయం లభించింది. దినసరి మార్కెట్‌ను రూ. 20,95,000కు మహమ్మద్ రఫీ, జంతు వధ శాలను రూ. 29,500కు దక్కించుకున్నారు. మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్ఓ సతీష్ కమలాకర్, ఆర్ఐ షెక్షావలి, కిరణ్ పాల్గొన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిరూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కులశేఖర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి తెలిపారు. కర్ణాటకలోని చిత్రదర్గ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కులశేఖర్‌రెడ్డి భౌతికాయానికి గురువారం ఆయన నివాళులర్పించారు. పార్టీ కోసం కులశేఖర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. సంతాపం తెలిపిన వారిలో సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ సభ్యులు రమణ, శీనా తదితరులు ఉన్నారు.

మద్యం షాపుల తనిఖీ



మద్యం షాపులో తనిఖీ చేస్తున్న
సూపరింటెండెంట్ రేవతి

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని పలు మద్యం షాపులను గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరెండెంట్ రేవతి తనిఖీ చేశారు. షాపుల్లో పనిచేస్తున్న వర్కర్లతో మాట్లాడారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా వసులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, డూప్లికేట్ మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి శాంపిల్స్‌ను తీసుకున్నారు. స్థానిక కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మద్యం వ్యాపారులపై బైండోవర్, అక్రమ సారా అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు, నవోదయం కార్యక్రమం, లోక్ అదాలత్‌లో ఎన్ని కేసులు పరిష్కారం తదితర అంశాలపై సీఐ నాయుడును అడిగి తెలుసున్నారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుబడిన 131.94 లీటర్ల మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

- రూ. లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని వైద్యాధికారులు



ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్



దుమ్ము, ధూళితో ఉన్న సిలిండర్లు

తాడిపత్రి రూరల్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. అప్పట్లో ప్రభుత్వాస్పత్రికి వచ్చే కరోనా రోగుల కోసం ప్లాంట్‌ను బిగించారు. వారి కోసం ప్రత్యేకంగా డీఆర్‌డీఓ తయారు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టుబట్టి పీఎం కేర్స్ కింద రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులకు ఉచితంగా అందజేశారు. జగన్ చలువ వల్ల ఎంతో మంది కరోనా రోగులు ప్రాణవాయువు తీసుకొని బతికి బట్టకట్టారు. ఆయన ముందు జాగ్రత్త నిర్ణయానికి కరోన రోగులు అభినందనలు తెలిపారు. ఈ ప్లాంట్‌లో గాలి ద్వారా ఆక్సిజన్‌ను తయారు చేసి రోగులకు అందజేస్తారు. అప్పట్లో ఎంతో మంది రోగులకు ఈ ప్లాంట్ ద్వారా తయారైన ఆక్సిజన్‌ను అందించారు. కరోనా అనంతరం ఈ ప్లాంట్ గురించి ఆసుపత్రి వర్గాలు పట్టించుకోలేదు. పని చేస్తున్న ఆక్సిజన్ ప్లాంట్‌ను పట్టించుకోలేదా లేక మరమ్మతులకు గురై ఉంటే వదిలి పెట్టారో తెలియడం లేదు. ఈ ప్లాంట్ మూత పడటంతో లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. ప్లాంట్‌ను పట్టించుకోకపోవడంతో సిలిండర్లు, పరికరాలు దుమ్ముపట్టిపోయాయి. మళ్లీ కరోనా లాంటి విపత్కర పరిస్థితి వస్తే పరిస్థితి ఊహించుకుంటేనే భయమేస్తోంది.

రూ.వేలు ఖర్చు చేసి ఆక్సిజన్ సిలిండర్ల కొనుగోలు

నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ గురించి అధికారులు పట్టించుకోకుండా రోగుల సౌకర్యార్థం పేరుతో వేలకు వేలు ఖర్చు చేసి ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేసి ప్రభుత్వాస్పత్రికి పంపుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే పాక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం



ప్రభుత్వాస్పత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్లాంట్ మరమ్మతు చేయడం వల్ల రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. అంతవరకూ రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. ఆదేశాలు రాగానే ప్లాంట్ మరమ్మతులు చేస్తాం.

– దేవిడ్‌రాజు, సూపరింటెండెంట్

హామీలు విస్మరించిన చంద్రబాబు



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి, రైతులను నిండా ముంచారని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు ఇప్పటికే రెండు విడతలు జమచేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారి కూడా వేయలేదన్నారు. కేంద్ర సాయం పోనూ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు బాకీ పడ్డ రూ.14వేలు అన్నదాత సుఖీభవ నిధుల గురించి మాటెత్తడం లేదన్నారు. కష్టాలు, నష్టాలతో సతమతమవుతున్న రైతులకు వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా ఇప్పటి వరకూ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలను వినియోగించుకోకుండా కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఉచిత పంట బీమాను ఎత్తేసి ఎకరాకు రూ.615 చొప్పున ప్రీమియం వసూలు చేస్తూ కూటమి ప్రభుత్వం రైతులపై భారం వేస్తోందన్నారు. టమాట, మిరప, పత్తి గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున, ఐటీ వింగ్ నాయకులు రామచంద్ర, జ్ఞానేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష వీడాలి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సమాజంలో ఎస్సీ, ఎస్టీలపై కొనసాగుతున్న వివక్షను పూర్తిస్థాయిలో రూపుమాపి సమానత్వాన్ని పెంపొందించడమే ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యమని ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ లెవెల్ స్థాయి రెండో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డివిజన్‌లోని 8 మండలాల ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఆర్డీఓతో పాటు డీఎస్పీ శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మానిటరింగ్ కమిటీలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాల్సి ఉంటుందన్నారు. సభ్యులు హరిప్రసాద్ యాదవ్, గోవిందు, మల్లికార్జున, రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అంటరానితనం, వివక్ష కొనసాగుతున్నాయన్నారు. కొంతమంది ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సక్రమంగా పనిచేయలేకపోతుందన్నారు. సమష్టిగా పనిచేస్తేనే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలమని, కావున కమిటీ సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భూసారం పెంచడానికి 'పీఎండీఎస్'



కోటంకలో పీఎండీఎస్ విధానంలో పంట సాగుకు విత్తనాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

గార్లదిన్నె: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భూసారం పెంచడానికి ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ (పీఎండీఎస్) విధానం అమలు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ అధికారి రంగారెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కోటంకలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతు రవీంద్ర పొలంలో పీఎండీఎస్ విధానంలో సద్ద, కంది, ఆముదము, అనుములు, అలసందతో పాటు 20 రకాల విత్తనాలు జీవ వైవిధ్య పంటలుగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసి సాగు చేశామన్నారు. అలాగే పొలంలో పీఎండీఎస్ విధానం వల్ల భూసారం పెరగడంతో పాటు భవిష్యత్‌లో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకుని మంచి దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శైలజ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: బాల్య వివాహాలు చేయడం వలన చట్టరీత్యా నేరమని డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. గురువారం మండలంలోని కొర్రపాడు ఎస్సీ కాలనీలో బాల్య వివాహాల నిర్మూలన, మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేయాన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేస్తే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాట వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి నెలా గర్భిణులు ఆస్పత్రిలో చెకప్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు అయ్యేటట్లు చూసుకోవాలన్నారు కార్యక్రమంలో ఆరోగ్య ఎడ్యుకేటర్ పర్వీన్, సీహెచ్‌ఓ మోహన్, రాజేంద్రప్రసాద్, రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



గుత్తిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఓబులేసు

గుత్తి/గుంతకల్లు టౌన్/తాడిపత్రి రూరల్: గుత్తి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఓబులేసు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. మహిళలపై వివక్ష వీడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, వారి భర్తలను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఆటల పోటీల్లో విజేతలైన అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, పార్వతి , మహాలక్ష్మి తదితరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు గౌరీ, శ్రీదేవి, రామ లక్ష్మమ్మ, పుష్పావతి, షాహిదా బేగం, కృష్ణవేణి, 1098 మాజీ కో–ఆర్డినేటర్ బాలాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

▸▸ గుంతకల్లులోని సీఐటీయూ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం జానకి, శంకరానంద కాలేజీ లెక్చరర్ శశికళ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ రిజ్వానా, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, నాయకురాళ్లు షాకీరా, జయమ్మ, సుగుణ, సరస్వతి పాల్గొన్నారు.

▸▸ తాడిపత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం చర్చి స్కూల్ విద్యార్థులకు పోలీసు స్టేషన్ పనితీరుపై ఎస్ఐ కాటయ్య వివరించారు. మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను భద్రపరచడం, వీహెచ్‌ఎఫ్ సెట్, లాకప్ గది,సీపీటీఎన్‌ఎస్, ఉమెన్ హెల్ప్ డెస్క్ తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సుబ్రమణ్యం

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటలు సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని రైతు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, ఉద్యాన శాఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం సూచించారు. గురువారం మండలంలోని వెంకటాపురంలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో, నీటి వనరులు తక్కువగా ఉన్నా డ్రిప్పు సౌకర్యంతో ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఉద్యాన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. అనంతరం కాయగూరలు, పూలు, పండ్ల తోటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల ఉద్యాన శాఖ అధికారి శైలజా మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ఎస్సీ రైతులకు ఎంఐడీహెచ్ పథకం కింద మూడు సంవత్సరాలు వరకూ టమాట పంట సాగు, షేకింగ్ విధానం ద్వారా 40 శాతం రాయితీతో ఇస్తామన్నారు. ఉద్యాన యాంత్రీకరణ ద్వారా ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్స్, మినీ ట్రాక్టర్, తైవాన్ స్ప్రేయర్స్ 50 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత్ కుమార్, ఉద్యాన అసిస్టెంట్ కావ్య, నరేష్, నేత్రా, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సీసీ కెమెరాలు అమర్చండి



మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

శింగనమల: ప్రైవేట్ పాఠశాలల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులను టీచర్లు కొట్టకుండా చూడాలన్నారు. స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలన్నారు. బస్సుల రికార్డులు సక్రమంగా ఉండాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్లు మాత్రమే నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల్లో పాఠశాలలను తనిఖీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పెద్దవడుగూరు(యాడికి): యాడికి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం గుత్తి ఏడీఏ వెంకట్రాముడు ఆకస్మిక తనిఖీ చేశారు. సంకల్ప రీటైల్ స్టోర్‌లో కోర్టు ఉత్తర్వుల మేరకు నెల రోజుల పాటు ఎలాంటి వ్యాపారం చేయవద్దని నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. భాస్కర్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపులో తనిఖీ లు నిర్వహించగా రూ.పది లక్షల విలువైన బయో ఉత్పత్తులకు ధ్రువ పత్రాలు చూపించకపోవడంతో వాటికి నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చారు. రైతులు ఎలాంటి ఎరువులు, మందులు కొనుగోలు చేసినా రసీదు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఎవరైనా అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఆలూరు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో కలిసిన సాంబశివారెడ్డి

శింగనమల: ప్రభుత్వ విద్య మాజీ సలహాదారు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం తాడేపల్లిలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయాలపై వారు చర్చించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు(యాడికి): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. యాడికి మండలం నిట్టూరు గ్రామంలో గురువారం జరిగిన ఓ వివాహానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం అయ్యారు. కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం అనంతపురంలోని ఓ కల్యాణమండపం జరిగిన కాశేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా రామకృష్ణారెడ్డి కూతురు నిశ్చితార్థానికి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యం

పామిడి: పట్టణంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎదురూరు ఓబులేసు కుమారుడి వివాహ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ నాయకురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వై.నైరుతిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైవీఆర్‌ను కలిసిన గంగుల భానుమతి



వైవీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన
గంగుల భానుమతి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని దివంగత మద్దెలచెరువు సూరి సతీమణి గంగుల భానుమతి పరామర్శించారు. సర్వైకల్ సర్జరీ చేయించుకున్న వైవీఆర్ ఇటీవల హైదరాబాద్ నుంచి గుంతకల్లుకు వచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా గురువారం వైవీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి ఆరోగ్యం, యోగక్షేమాల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాలపై చర్చించారు.

పశువులను తరలిస్తున్న ఐచర్ వాహనం పట్టివేత



ఐచర్ వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి: పశువులను అక్రమంగా ఐచర్ వాహనంలో తరలిస్తుండగా గురువారం రాత్రి గుత్తిలో పట్టుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు ఆజాద్, నాగమాణిక్యం, పోలీసులు ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐచర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పశువులు ఏ ప్రాంతం నుంచి తీసుకొస్తున్నారు.ఎన్ని పశువులు ఉన్నాయో తెలియడం లేదు. పోలీసుల దర్యాప్తులో వివరాలు తెలిసే అవకాశముంది.

సంక్షిప్త సమాచారం

హుండీ కానుకల లెక్కింపు

పెద్దవడుగూరు(యాడికి): యాడికి మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను గురువారం ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామ పెద్దలు లెక్కించారు. భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలను లెక్కించగా రూ. 1.55 లక్షలు, టెంకాయల వేలం ద్వారా రూ. 2,40,116 ఆదాయం సమకూరినట్లు ఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్–డీ అభ్యర్థులకు మోడల్ టెస్ట్

గుంతకల్లుటౌన్: ఆర్‌ఆర్‌బీ గ్రూప్–డీ, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీధర్స్ కోచింగ్ వారి సహకారంతో ప్రతి ఆదివారం ఉచిత మోడల్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర తెలిపారు. స్థానిక శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్‌ఆర్‌బీ అభ్యర్థులకు ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఓబులపతి అనే వ్యక్తి గాయపడ్డాడు. ఆర్‌ఎస్‌కు చెందిన ఓబుళ పతి బైక్‌లో గుత్తికి వెళుతుండగా ముందు వెళుతున్న ఆటోను ఢీ కొన్నాడు. గాయపడిన ఓబుళపతిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యాచకుడి మృతి

గుంతకల్లు రూరల్: కొంత కాలంగా కసాపురం గ్రామంలోని ఆలయాల వద్ద యాచకుడిగా జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి (55) గురువారం మృతి చెందాడు. గురువారం ఉదయం ఆపరాజిత ఆలయం వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే వీఆర్వో శ్రీధర్, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న వీఆర్వో, పోలీసులు మృతుడి వద్ద ఆధారాలు ఏవైనా లభిస్తాయోమోనని వెతికినా ఫలితం లేకపోయింది. ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహించారు.

కొత్త బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురండి

పామిడి: పట్టణంలోని కొత్తబస్టాండ్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలని సీపీఐ నాయకులు కే రహీమ్, వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కొత్త ఆర్టీసీ బస్టాండ్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొత్త బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. తద్వారా ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రహరీ నిర్మించి, ప్రయాణికులకు అనుగుణంగా ఉండేలా సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల నాయకులు ఓంకార్, బాషా, ఇమాములు, సారాబీ, శివయ్య, శ్రీను, రాముడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి: క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బింగి కిరణ్ బాబు తెలిపారు. గుత్తిలోని తన ఇంటిలో గురువారం మాట్లాడారు. తనపై నమ్మకంతో నియోజకవర్గం అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. పదవిని బాధ్యతగా భావించి నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామన్నారు.